
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 30 మార్చి 2025



సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు



బ్యాటరీ స్ప్రేయర్స్	101
పవర్ స్ప్రేయర్స్	102
డ్రోన్	1
రోటవేటర్	51
సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్	12
కల్టివేటర్	67
బండ్ ఫార్మర్	4
పవర్ వీడర్	2
బ్రష్ కట్టర్	5
పవర్ టిల్లర్	3
ట్రాక్టర్లు	3
స్ట్రా బాలర్స్	2
మొత్తం	353

- మహిళా రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రేపటి వరకు గడువు
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీ
- జిల్లాకు రూ.78.79 లక్షలు మంజూరు

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రికీకరణ పథకం కింద మహిళా రైతులకు యంత్ర పరికరాలను రాయితీపై అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం జిల్లాకు 78.79 లక్షల రూపాయల నిధులను కేటాయించడంతో పాటు 353 వ్యవసాయ పరికరాలను ఇవ్వనుంది. వీటన్నింటిని సన్న, చిన్న కారు రైతులకు 40 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీతో మహిళా రైతులకు మాత్రమే ఇవ్వాలని నిబంధన విధించడంతో పాటు ఈ నెలాఖరులోగా గ్రౌండింగ్ చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అన్ని నియోజక వర్గాల వారీగా పరికరాలను, నిధులను కేటాయించారు. మండలాల వారీగా మహిళా రైతులను ఎంపిక చేయనున్నారు.

నిబంధనలతో ఇబ్బందులు..

ట్రాక్టర్‌కు సంబంధించిన యంత్రాలు ఇచ్చేందుకు భూమి మహిళల పేరుతో ఉండాలని నిబంధన విధించారు. ట్రాక్టర్ ఆర్‌సీ మహిళల పేరుతో ఉంటేనే దరఖాస్తు చేయాలనే నిబంధనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి దరఖాస్తు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వ్యవసాయ శాఖలో యాంత్రీకరణ పథకాన్ని నిలిపేసింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పున రుద్ధరించి జిల్లాల వారీగా నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరులోపు మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగానే వివిధ కంపెనీలకు చెందిన తయారీదారులు సంబంధిత పరికరాలను సరఫరా చేయాల్సి ఉంటుంది.

సబ్సిడీపై పరికరాలు

వ్యవసాయదారులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించే వ్యవసాయ యాంత్రికీకరణ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. రైతులకు అవసరమైన వివిధ రకాల పరికరాలు, యంత్రాలు సబ్సిడీతో అందించేందుకు వ్యవసాయ శాఖ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కానీ దరఖాస్తు చేసేందుకు కొద్ది రోజులే గడువు ఇవ్వడంతో సర్వత్రా అయోమయం నెలకొంది. ఈ పథకాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అందిస్తోంది. సన్న, చిన్నకారు, ఇతర వర్గాలకు చెందిన మహిళా రైతులు దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన వారికి సబ్సిడీలో అవసరమైన వ్యవసాయ పరికరాలు అందజేస్తారు.

లబ్ధిదారులను ఎంపిక చేస్తాం

భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



వ్యవసాయ యాంత్రికీకరణ పరికరాల గ్రౌండింగ్‌ను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నియోజకవర్గాలు, మండలాల వారీగా పరికరాలతో పాటు నిధుల కేటాయింపు పూర్తి చేశాం. త్వరలో మహిళా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి పరికరాల గ్రౌండింగ్ చేస్తాం.



'మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అండ'



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్దార్ రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, అబ్దుల్ ఖాదర్, ముజాహిద్, క్యాదాసు నాగయ్య, నవీన్, కూసరి అనిల్, బద్దం జగన్మోహన్ రెడ్డి, ఎంఏ ఆరిఫ్, దుమాల రాజ్‌కుమార్, చాంద్ పాషా పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొడిమ్యాల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మసీదులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ పండగను జరుపుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు















రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4:52 (సోమవారం ఉదయం)

ఫిల్టర్‌బెడ్ పనుల పరిశీలన

జగిత్యాలరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని ఫిల్టర్ బెడ్ మరమ్మతులను పనులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం పొలాస పౌలస్తేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోని పిల్టర్‌బెడ్ పనుల మరమ్మతుల కోసం రూ.14 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, మాజీ సర్పంచ్ రాధకిషన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ షాహిద్, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

-రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, రియాజ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం జగిత్యాల జిల్లా స్థాయి సన్నాహక కార్యక్రమం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వగృహంలోని ఇందిరాభవన్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జిగా హాజరైన రియాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన హక్కులను కాపాడాలని జై బాపు, జై భీమ్, జై సమీరా కార్యక్రమాన్ని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ గ్రామన తీసుకువెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్ర సంతోష్, జువ్వాడి కృష్ణారావు, కత్తి వెంకట స్వామి, బండ శంకర్, రఘువీర్ గౌడ్, మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, పీఏసీసీ చైర్మన్ రామలింగారెడ్డి, మాజీ కౌన్సిలర్ కండ్లపెల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

'జీవన్‌రెడ్డికి త్వరలో ఉన్నత పదవి'

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పదవీ కాలం శనివారంతో ముగుస్తుందని, అయినప్పటికీ ప్రభుత్వంలో అత్యున్నత పదవి జీవన్‌రెడ్డికి వస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి నుంచి జీవన్‌రెడ్డి విషయంలో స్పష్టమైన హామీ వచ్చిందని అన్నారు. జీవన్‌రెడ్డి సేవలు రాష్ట్రానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అవసరమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

'ప్రజా సేవకు పదవితో పని లేదు'

ఇందిరాభవన్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి పదవితో సంబంధం లేదని, తాను ఎప్పుడూ ప్రజలతోనే ఉంటానని అన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏరోజు కూడా విమర్శలపాలు కాలేదన్నారు. ప్రజా జీవితంలో ఇంకొన్నేళ్లు కొనసాగుతానని అన్నారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గంలోని 312 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 10 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు

బీర్‌పూర్,మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం జిల్లా జడ్జి నీలిమ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్ద సంతోష్, మధు కుమార్, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో 2025-26 ఏడాదికి ఫస్టియర్‌లో చేరికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత ప్రకటన ద్వారా శనివారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీలో 44, ఎంబీసీలో 44 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంచాంగాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, మార్చి (ఆంధ్ర జ్యోతి): జిల్లా జంగమ సమాజం ఆధ్వర్యంలో శ్రీవిశ్వవసునామ సంవత్సర కొలను భారతి పంచాంగాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగండిమఠం భువనేశ్వర్, గుంటి మఠం నిరంజన్, శ్రీరాం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బీర్‌పూర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలోని కండ్లపెల్లి గ్రామంలో గల ఒడ్డెరా కాలనీలో శనివారం తాజ మాజీ సర్పంచ్ పర్వతం రమేష్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఇటీవల ఒడ్డెరా కాలనీకి ఈజీఎస్ నిధుల కింద 5 లక్షలు మంజురి కాగా పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు తదితరులు ఉన్నారు.

'హామీలపై నిలదీస్తే విమర్శలు తగదు'

జగిత్యాలరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హామీలపై నిలదీస్తే ఎమ్మెల్సీ కవితపై విమర్శలు చేయడం తగదని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు దావ సురేష్ అన్నారు. జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో దావ సురేష్ శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, ప్రణయ్, ప్రతాప్, గంగారెడ్డి, చందు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.







తాగునీటికి తిప్పలు


- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆదుకోని మిషన్ భగీరథ
- వేసవి ప్రారంభంలోనే ఇబ్బందులు

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎండకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి సమస్య, ఎండిపోతున్న బావులు, అడుగంటిన భూగర్భ జలాలు, ఆదుకోని భగీరథ పథకంతో ప్రజలు అవస్థలపాలవుతున్నారు. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి, ఆచంపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నది. ఆచంపల్లిలో రెండు మంచి నీటి బావులు, 20 సింగిల్ ఫేస్ బోర్లు, మిషన్ భగీ రథ



ఆచంపల్లిలో తాగునీరు అందించే బోర్

నీరు వస్తున్నా తాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా ఎస్సీ కాలనీకి ప్రతి యేటా నీటి సమస్య ఏర్పడుతోంది. గ్రామంలో వాడవాడలకు బోర్లు ఏర్పాటు చేయడంతో వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి గ్రామంలోకి నీటిని సరఫరా చేయడం నిలిచిపోయింది. దీనికి తోడు గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ ఉండగా పైపుల్లో ఫ్లోరైడ్ గడ్డకట్టి ఎక్కడి కక్కడా లీకేజీలు ఏర్పడ్డాయి. ఎనిమిది సంవత్సరా లుగా సగం గ్రామానికి వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేయక ఫ్లోరైడ్‌తో పైపులు నిండిపోయింది. వాడవాడకు ఏర్పాటు చేసిన బోర్లలో ఏదో ఒక సమస్యతో చాలా వరకు బోర్లు పని చేయడం లేదు. దీంతో చేసేదేం లేక అదనంగా ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇదే సమస్యతో వేసవిలో నీటికి ఇబ్బందులు పడుతూ కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో కొత్త పైపులైను వేస్తే నీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు చెపుతున్నారు. చిన్న గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు జీతాలకు, ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులకు వినియోగిస్తున్నారు. గ్రామంలో 20 సింగిల్ ఫేస్ మోటార్లు నడుస్తుండగా గత 8 సంవత్సరాలుగా వస్తున్న కరెంటు బిల్లు రూ. 25 లక్షలకు చేరింది. ఈ బిల్లు ఎలా చెల్లించేదని కార్యదర్శి తలపట్టుకుంటున్నారు.



మర్రిగడ్డ బావిలో అడుగంటిన భూగర్భ జలాలు

● క్వారీతో అడగంటిన భూగర్భ జలాలు

సర్వారెడ్డిపల్లి అనుబంధ గ్రామం మర్రిగడ్డ శివారులో గతంలో మంచినీటి బావి తవ్వారు. 17 గజాల లోతు బావిలో రెండు నెలలుగా కేవలం అరమీటరు నీరు ఊరుతుంది. బావి మోటర్ ఆన్ చేస్తే అరగంట మాత్ర మే వస్తున్న నీరు సరిపోవడంలేదు. బావికి రెండు వందల మీటర్ల దూరంలో క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. గతంలో సమృద్ధిగా నీరందించిన బావి క్వారీ తవ్వకాలతో క్రమక్రమేనా భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో గత మూడేళ్లుగా ఏప్రిల్‌లోనే ఎండిపోతోంది. రెండు రోజులకోసారి వస్తున్న మిషన్ భగీరథ నీటినే పొదుపుగా వాడుకుంటున్నారు. ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ముప్పిడి పల్లి బావి నుంచి సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ, ముప్పిడి నర్సయ్యపల్లికి నీటిని సరఫరా చేస్తుండేవారు. ముప్పిడి నర్సయ్యపల్లి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడగా ఈ బావి నీటిని సర్వారెడ్డిపల్లికి నిలిపి వేశారు. దీంతో సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ గ్రామాలు వేసవిలో తీవ్ర నీటి కష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. పొలాల కోతలు పూర్తయితే వ్యవసాయ బావులవద్ద నుంచి నీటిని మోసుకు వస్తుంటారు. అయితే చెరువు సమీపంలో కొత్త బావి తవ్వించాలనే ప్రతిపాదన ముందుకు సాగడం లేదు. అధికారులు తాగునీటికి ఏర్పాట్లు చేసి వేసవిని గట్టెక్కించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మూడేళ్లుగా నల్లానీటికి గోసపడుతున్నం..

- కనుకమ్మ, ఆచంపల్లి



మా కాలనీకి మూడేళ్లుగా నల్లా నీరు వస్తలేవు. ఇక్కడ వాడకు ఒక్కటే బోరు ఉంది. దాని నుంచే అందరం నీరు తెచ్చుకుంటాం. కరెంటు ఉంటేనే మాకు నీరు. సొంతంగా పైపులు తెచ్చుకుని నీటిని డ్రంబుల్లో నింపుకుని వాడుకుంటాం. మా ఊరి నీల్ల సమస్యను పరిష్కరించాలి.

కులం కట్టుబాట్లే హత్య చేయించాయి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యం రావు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముత్యంరావు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కులం కట్టుబాట్లు పరువు హత్యకు పురిగొలిపాయని సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు ముత్యం రావు అన్నారు. శనివారం ముప్పిరితోటలో ఇటీవల పరువు హత్యకు గురై మృతిచెందిన పురేళ్ల సాయికుమార్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను మృతుడి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులం, కట్టుబాట్లు, మూఢత్వం పేరుతో సాయికుమార్‌ను హత్యచేశారని, ప్రేమించుకున్న పాపానికి అత్యంత దారుణంగా హత్య చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి సంఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాలని, మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అందుకు ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఏర్పాటుచేసి విచారణ త్వరితగతిన పూర్తిచే యాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్‌యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లాకమిటీసభ్యుడు అశోక్, నాయకులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

హత్యపై విచారణ వేగవంతం చేయాలి

● ఏసీపీని అభ్యర్థించిన సాయికుమార్ మిత్రులు



ఏసీపీ కార్యాలయంలో సాయికుమార్ మిత్రులు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో ఈనెల27నజరిగిన పూరెళ్ల సాయికుమార్(20) దారుణ హత్యపై విచారణ వేగవంతం చేయాలని శనివారం రాత్రి మృతుడు సాయికుమార్ మిత్రులు పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణను కలిసి అభ్యర్థించారు. గతంలో రెండుసార్లు సాయికుమార్‌పై దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆయనకు వివరించారు. హత్య చేసిన ముత్యం సది అలియాస్ సదయ్య, భార్య సమత, బావమరిది సారయ్య, హత్యకు ప్రేరేపించి, కుట్రపన్నిన చీకటి హరీష్, మల్లయ్యను కఠినంగా శిక్షించాలని ఏసీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర పంచాయతీ కార్మికుడు షాహిద్(28) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు గతంలో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌తగిలి కుడిచేయి పోగొట్టుకున్నాడు. శనివారం చాతిలో నొప్పి వస్తుందని తెలుపగా అక్కడే పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కాళ్లు, చేతులు రాపిడిచేసి 108కు సమాచారం అందించారు. జగిత్యాల ఏరియాఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో శనివారం వృద్ధురాలు మృతిచెందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య, కళావతి దంపతులు ఐదు రోజుల కిత్రం గర్రెపల్లికి వచ్చారు. వీరు భిక్షాటన వృత్తిగా చేసుకుని జీవిస్తారు. శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. శనివారం ఉదయం ఎనిమిదన్నర గంటల ప్రాంతంలో కళావతిని నిద్రలేపగా చనిపోయి ఉంది. దీంతో మృతురాలి భర్త నర్సయ్య వెంటనే కూతురు కల్పనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. తల్లి మృతిపట్ల అనుమానాలు ఉన్నాయంటూ కూతురు కల్పన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకున్నారు.

కెనాల్‌లో పడి గల్లంతైన చిన్నారి

రామగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుక బట్టీలో పనిచేసే ఒడిశా రాష్ట్రం అంగూల్ జిల్లాకు చెందిన కూలీ దాత్‌సాగర్ దంపతుల చిన్న కూతురు గేలిహీ(2) అనే చిన్నారి డి-83 కెనాల్‌లో శనివారం ప్రమాదవశాత్తు పడింది. ఇటుక బట్టీలో పని కోసం 7 నెలల క్రితం ఇక్కడకు వచ్చారు. దాత్‌సాగర్‌కు ముగ్గురు పిల్లలు. శనివారం కెనాల్ సమీపంలో ఆడుకుంటుండగా అదుపు తప్పిన చిన్నారి కెనాల్‌లో పడి గల్లంతైంది. కెనాల్ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఎస్ఐ చంద్రకుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. గల్లంతైన చిన్నారి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

ఈత చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక తిరుపతిగౌడ్ అనే కల్లు గీత కార్మికుడు శనివారం కల్లు గీయడానికి ఈత వనంలోకి వెళ్లాడు. ఎప్పటిలాగానే ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారికింద పడిపోగ తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ సెక్రెటరీ, సెక్యూరిటీగార్డు

● పండ్ల వ్యాపారుల లైసెన్స్‌కు రూ.2 లక్షలు డిమాండ్ ● 60 వేలు తీసుకుంటుండగా ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదరి ఎ.పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డిని అవినీతి నిరోధకశాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో హోల్‌సేల్ పండ్లవ్యాపారులు ఏఎంసీలోనే షెడ్లు, గోదాంలలో మామిడి, బత్తాయి వంటి వివిధ రకాల పండ్లను నిలువ చేస్తారు. అక్కడి నుంచే జిల్లా వ్యాప్తంగా రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తారు. దీని కోసం హోల్‌సేల్ వ్యాపారులు ఏఎంసీ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. నామినల్‌గా వెయ్యి నుంచి 2 వేల వరకు ఫీజు చెల్లించాలి. ఈలైసెన్స్‌ను వ్యాపారులు మూడేళ్లకో సారి రెన్యూవల్ చేసుకోవాలి. ఏఎంసీలో హోల్‌సేల్ పండ్ల వ్యాపారం చేస్తున్న 15మంది లైసెన్స్‌ల గడువు ఈనెల31తో ముగుస్తుంది. రెన్యూవల్ చేయాలని నెల రోజుల నుంచి ఏఎంసీ సెక్రెటరీని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఒక్కో లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని పండ్లవ్యాపారులు రిక్వెస్ట్ చేసినా తగ్గేదేలేదని చెప్పాడు. చివరికి శుక్రవారం పండ్ల వ్యాపారులతో తన చాంబర్‌లోనే ఒక సమావేశం ఏర్పాటుచేసి ఒక్కోవ్యాపారి 60వేల రూపాయలతోపాటు అన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తే లైసెన్స్ రెన్యూవల్‌కు అంగీకరించాడు. దీంతో వ్యాపారులు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తిని ఆశ్రయించారు. కరీంనగర్ ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మకాయలపాషా, అలియాస్ ఎండీ అబ్దుల్‌గఫార్ ఈ మేరకు ఫిర్యాదుచేశాడు. ఏసీబీ పోలీసుల సూచనతో మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిమ్మకాయల పాషా అలియాస్ అబ్దుల్‌గఫార్ 60వేల రూపాయలు లంచం డబ్బులు సెక్రెటరీ పురుషోత్తంకు అతడి చాంబర్‌లోనే ఇచ్చేందుకు వెళ్లాడు. బయటసెక్యూరిటీ గార్డుకు ఇవ్వాలని పురుషోత్తం సూచించాడు. బాధితుడు ఆ డబ్బులను సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డికి ఇస్తుండగా మఫ్టీలో ఉన్న ఏసీబీ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సెక్రెటరీతోపాటు, సెక్యూరిటీగార్డును అరెస్టు చేశారు. 60 వేల రూపాయలు సీజ్ చేసినట్లు, ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు



ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ కార్యదర్శి పురుషోత్తం, సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డి, స్వాధీనం చేసుకున్న నగదు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

● జగిత్యాలలో సోదాలు..

ఏఎంసీ సెక్రెటరీ పురుషోత్తం చాంబర్‌లో ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు జరిపారు. పండ్లవ్యాపారుల లైసెన్స్‌ల రెన్యూవల్ కోసం సమర్పించిన దరఖాస్తులు, ఇతర రికార్డులను సీజ్‌చేశారు. మరో వైపు ఏసీబీ మరో బృందం పురుషోత్తం స్వస్థలం జగిత్యాలలోని అతడి ఇంటిలో, మరో చోట సోదాలు జరిపారు. లక్షకుపైగా నగదు, ఇతర డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

● లంచాల కోసం వేధింపులు..

కరీంనగర్ ఏఎంసీకార్యదర్శి ఎ.పురుషోత్తం ఐదేళ్లుగా లంచాల కోసం పండ్ల వ్యాపారులను వేధిస్తున్నాడని పండ్ల వ్యాపారులు నిమ్మకాలయపాషా, సుల్తాన్ ఆబిద్ ఆరోపించారు. తాము ఆరేళ్లుగా కరీంనగర్ ఏఎంసీలో హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. పండ్లు నిలువ చేసుకునేందుకు ఏఎంసీలో చిన్నచిన్న షెడ్‌లను అద్దెకు తీసుకుంటామన్నారు. షెడ్‌కు రూ.20వేల అద్దెను క్రమంతప్పకుండా ఏఎంసీకి చెల్లిస్తున్నా అదనంగా కార్యదర్శి పురుషోత్తం మరో రూ.20వేలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. లంచంఇవ్వని వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు. పండ్లలోడ్‌తో వచ్చినవాహనాలను మార్కెట్‌యార్డులోకి అనుమతించక పోవడం, గేట్ మూసివేయడం వంటివి చేసేవాడని పేర్కొన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. షెడ్‌ల కోసం అదనంగా వసూలు చేసిన డబ్బులను రికవరీ చేయాలన్నారు.

ఎస్‌యూలోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేయాలని హుస్నాబాద్‌కు తరలిస్తున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నాచేశారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోతోందన్నారు. ఉత్తరతెలంగాణలో కరీంనగర్ విద్యాకేంద్రంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు ప్రైవేటుఇంజనీరింగ్ కళాశాల ల్లో ఫీజులు కట్టలేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చినహామీలను నెరవేర్చడంలో విఫలమైంద న్నారు. కరీంనగర్ జిల్లాలో కళాశాలను ఏర్పాటుచేస్తామని స్వయంగా సీఎంరేవంత్‌రెడ్డి పెద్దపల్లిసభలో ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో పొన్నంప్రభాకర్ ఇల్లు ముట్టడిస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు గజ్జెల శ్రీకాంత్, మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, రామారావు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, టౌన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్, సాగర్, సందీప్, సందేశ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌యూ గేటు ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎంత కష్టం!

- కన్నతల్లిని రోడ్డు పక్కన వదిలి వెళ్లిన కొడుకులు
- సిరిసిల్లకు తరలించిన అంగన్‌వాడీ కార్యకర్తలు



వృద్ధురాలు

వేములవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయసులో ఆ వృద్ధురాలికి అనుకోని కష్టం వచ్చింది. కన్నకొడుకులు నడిరోడ్డుపైనే వదిలేయడంతో ఆ తల్లి దాదాపు 20 రోజులు నరకయాతన అనుభవించింది. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను చేరదీసి సిరిసిల్లకు తరలించారు. వేములవాడ పట్టణంలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల సమీపంలోని పెద్దూరుకు చెందిన గంగవ్వ(70)కు ఇద్దరు కొడుకులు. ఏం జరిగిందో తెలియదు కానీ దాదాపు 20 రోజుల క్రితం గంగవ్వను కారులో తీసుకువచ్చి వేములవాడ పట్టణంలోని జాతరగ్రౌండ్ లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ఎదురుగా మెట్లపై వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. వృద్ధాప్యానికి అనారోగ్యం తోడు కావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు 20 రోజులుగా స్థానికులు కొంత ఆహారం అందిస్తూ వచ్చారు. విషయం తెలుసుకున్న వేములవాడ సీడీపీవో సౌందర్య శనివారం అంగన్‌వాడీ సిబ్బందితో వచ్చి వృద్ధురాలికి స్నానం చేయించి, బట్టలు మార్పించి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేయాలి

- ప్రతి రోజు 40కిలోమీటర్లు ప్రయాణిస్తున్న ఇంటర్ విద్యార్థులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా చదువులు

గన్నేరువరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం నూతనంగా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు దాటినా నేటికీ మండలంలో ప్రభుత్వజూనియర్ కళాశాల ఏర్పాటుచేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని విద్యార్థులు ఇంటర్ చదువులకు కరీంనగర్‌కు ప్రతిరోజు 40కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. మండలకేంద్రంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో గత్యంతరం లేక ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ కాలేజీల బస్సుల్లో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైన స్థలం ఉండడంతో అందులో కాలేజీ ఏర్పాటుచేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు దానిపైన ఎలాంటి దృష్టిని పెట్టలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కరీంనగర్‌లోని ప్రైవేట్‌కాలేజీలకు పంపాల్సి వస్తుంది. తల్లిదండ్రులకు భారం పెరుగుతోంది. దూరాభారంతో పిల్లలకు చదువుపై ఏకాగ్రత లోపిస్తుందని లక్షలు ఖర్చుపెట్టి హాస్టల్‌లో ఉంచుతూ పిల్లల చదువు కోసం అప్పుల పాలవుతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతు న్నారు.



కాలేజీకి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు(ఫైల్)

విద్యుదాఘాతంతో రైతు మృతి

జగిత్యాలరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేటకు చెందిన చింతకుంట్ల రాజనర్సయ్య(58) అనే రైతు వాగులో చేపలు పడుతుండగా విద్యు దాఘాతంతో మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజనర్సయ్య తిప్పన్నపేట శివారులో విద్యుత్ వైరు అమర్చి వాగులో చేపలు పడుతున్నాడు. ఈక్రమంలో విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. శనివారం బంధువులు రాజనర్సయ్య ఆచూకీ కోసం వెతుకుతుండగా వాగులో మృతదేహం కన్పించింది. పోలీసులు మృతదేహాన్ని వాగులో నుంచి బయటికి తీసి జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంబస్వాపూర్‌కుచెందిన వ్యవసాయకూలీ బంటు ఆనందం (45) చెట్టుపైనుంచి పడి మృతిచెందాడు. శనివారం గ్రామంలోని చెట్టుపై చింతకాయలు తెంపేక్రమంలో ప్రమాదవ శాత్తుజారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆనందంను చికిత్సకోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించిచికిత్స చేస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్నగ్రామస్థులు

ముస్తాబాద్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ మానేరువాగు ఇసుకరీచ్ నుంచి ముస్తాబాద్ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇసుకను రవాణా చేయడం సరైనది కాదన్నారు. ముస్తాబాద్‌లో జరిగే అభివృద్ధి పనులకు ముస్తాబాద్‌కు చెందిన ట్రాక్టర్ యజమానులకు రవాణా బాధ్యతలు అప్పగించాలని కోరారు. వాగులో ఇసుక ట్రాక్టర్లు, యజమానులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు సంఘటన స్థలానికివెళ్లి వారిని శాంతింప చేశారు.

కుక్కను రక్షించబోయి బాలిక మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కను రక్షించబోయిన బాలిక చెరువులో పడి మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలం రేకుర్తిలో శనివారం జరిగింది. కొత్తపల్లి పోలీసుల వివరాలప్రకారం.. రేకుర్తికి చెందిన మైరాల శ్రీనిధి(11) శనివారం తన పెంపుడు కుక్కతోపాటు పెంటకమ్మ చెరువు వద్దకు వెళ్లింది. కొద్దిసేపు ఆడుకున్న తరువాత పెంపుడు కుక్క చెరువులోపడగా శ్రీనిధి గమనించి వెంటనే కుక్కను తాడుతో బయటకు లాగేక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయింది. గమనించిన ఇద్దరు యువకులు వెంటనే శ్రీనిధిని బయటకు తీసి ఆసుపత్రికి తర లించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. శ్రీనిధి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనిధి(ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో ఈనెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య(45) గాయాల పాలై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపారిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గంగయ్యను అదే గ్రామానికి చెందిన బిస్కు సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న చిన్న గంగయ్య పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్ల మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

నేటి నుంచి చైత్ర మాసం

● ఏప్రిల్ 9 నుంచి జూన్ 7 వరకు శుభ ముహూర్తాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరంలో చైత్రమాసం, వసంత ఋతువు ఆదివారంతో ప్రారంభం కానుంది. వసంత ఋతువు, చైత్ర మాసం సంవత్సర ప్రారంభాలుగా, బ్రహ్మదేవుడు ఉగాది నాడే సృష్టి రచన ప్రారంభించాడని చెబుతారు. చైత్ర మాసంలో విశేష రోజులున్నా శ్రీరామ నవమి తర్వాతే శుభకార్యాలు ఆచరించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 9వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వివాహాది శుభకార్యాలు నిర్వహించవచ్చు. మే 4 నుంచి 29వ తేదీ వరకు వాస్తు కర్తరితో గృహ ప్రవేశాలకు అవకాశం ఉండదు. జూన్‌లో గురు మూఢం కారణంగా జూన్ 10వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. ఆగస్టు నెల శ్రావణమాసంలో ముహూర్తాలున్నాయి.

జాతీయస్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ



రైల్వేస్టేషన్‌లో నవీనను సత్కరిస్తున్న సీనియర్ క్రీడాకారులు

కోల్‌సిటీటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగిన ఖేలో ఇండియా అండ్ ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ కనపర్చిన ఓడ్డెపల్లి నవీనకు శనివారం రామగుండం రైల్వేస్టేషన్‌లో స్థానిక క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. రామగుండం రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తగరపు శంకర్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్, సీనియర్ కరాటే మాస్టర్ శ్రీనివాస్‌లు నవీనను సన్మానించారు. ఉషూ క్రీడలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జాతీయస్థాయిలో పతకాలు సాధించడం ఇదే మొదటిసారి అని కొనియాడారు. తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ కప్ సీనియర్ విభాగంలో రెండు విభాగాల్లో ప్రతిభ కనపర్చి ద్వితీయ, తృతీయస్థానాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. రామగుండం మండల బీజేపీ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్వన్‌సింగ్, భావని, యూత్ అధ్యక్షుడు నల్లి నరేష్, కోచ్ సురేష్ పాల్గొన్నారు

చేతి వృత్తులకు వరం..

● ప్రధాని విశ్వకర్మ యోజనతో చేయూత
● పలు అంశాల్లో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనను ప్రవేశ పెట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 17 సెప్టెంబరు 2023న ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. కేంద్ర ప్రభుత్వం 18 విభిన్న రంగాలకు చెందిన కళాకారులకు శిక్షణతో పాటు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో కార్పెంటర్, బోట్ మేకర్, ఆర్మర్, కమ్మరి, తాళాలు చేసేవారు, గోల్డ్ స్మిత్, కుండల తయారీదారులు, శిల్పి, తాపీ మేస్త్రీ, మత్స్యకార వలలు తయారు చేసేవాళ్లు, రాయి కొట్టేవారు, చెప్పులు కుట్టే వారు, బుట్ట, చాప, చీపుర్లు, గార్లండ్ మేకింగ్ (మలకార్), బొమ్మల తయారీ దారులు, టైలరింగ్, నాయి బ్రహ్మణులు వంటి సాంప్రదాయ వృత్తుల వారు ఉన్నారు. ఎంపికైన వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి లబ్ధిదారులకు వ్యాపారం చేసేందుకు అర్హులైన వారికి తక్కువ వడ్డీకి రుణం అందిస్తారు.



శిక్షణలో భాగంగా మహిళలు తయారు గాజులు, బోకేలు, పూల దండలు

● ప్రయోజనాలు

ఈ పథకం కొసం దరఖాస్తు చేసుకున్న తరువాత నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు 500 రూపాయల స్టైపండ్, శిక్షణ అనంతరం సర్టిఫికేట్, గుర్తింపు కార్డును ఇస్తారు. వ్యాపారానికి అవసరమయ్యే పరికరాల కిట్‌ను కాని, కిట్ కొనుగోలుకు అవసరమైనా ఆర్థిక సహాయం కాని అందజేస్తారు.

● మహిళా ప్రాంగణంలో..

తిమ్మాపూర్ మండలంఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా మహిళాలకు పలు చేతి వృత్తులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. దండలు అల్లడం, చీరల కొంగులు ముడివేయడం, బోకేస్ తయారు చేయడం, ఎన్వలప్, హోమ్ డెకరేటర్ వస్తువులు, ఇయర్ రింగులు, బ్యాంగిల్స్ డిజైన్, పేపర్ ఫ్లవర్స్ తయారీపై శిక్షణ నిస్తున్నారు. ఇప్పటికి నాలుగు బ్యాచులకు శిక్షణ పూర్తయింది. ఒక్కో బ్యాచ్‌లో 10నుంచి17మంది మహిళాలకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ బాగుంది..

- ఎన్‌లత, వేములవాడ



కార్యదర్శులు చేబితే అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ బాగుంది. పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

ఉపాధి అవకాశాలు ఉంటాయి

- రాజ వర్ధిణీ, ట్రైనర్



ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరి శిక్షణ పొందుతున్న మహిళాలకు ఉపాధి అవకాశాలు బాగుంటాయి. ఇంట్లో ఉండి కూడా జీవనోపాధి పొందొచ్చు. బ్యాంగిల్స్ డిజైన్, ఇయర్ రింగ్స్ పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ

సుధారాణీ, ప్రాంగణం జిల్లా మేనేజర్



ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చాం. ఒక్కో బ్యాచ్‌లో 10 నుంచి 17 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. నిరుపేదలకు ఈ పథకం వరం లాంటింది. ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ ఇస్తున్నాం. శిక్షణ అనంతరం ఉపాధి పొందేందుకు సహకారం అందజేస్తాం.

● అర్హతలు :

ఈ పథకానికి 18 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు, అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాపారాల్లో నైపుణ్యం కలిగి, చేతి వృత్తులు సాగించే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొడానికి అర్హులు.

● ఇలా దరఖాస్తుల చేసుకోవాలి

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరే వారు ముందుగా సంబంధిత ప్రభుత్వ వెబ్ సైట్(**pmvishwakarma.gov.in**)లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేయడానికి ఆధా ర్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు గానీ, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, చిరునామాను నిర్ధారించే పత్రం, పథకానికి సంబందించి ఆర్థిక లావాదేవీలు నిర్వహణకు బ్యాంకు ఖాతా వివరాలతో దరఖాస్తు చేసుకొవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం పూర్తి అయిన తరువాత వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అర్హులైనా వారిని ఉచిత శిక్షణకు పిలుస్తారు.

ధర్మపురిలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజ లు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశ చూపి రూ.40.9 లక్షలు స్వాహా చేసిన అంతర్రాష్ట సైబర్ మోసగాడిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి 2024 జూలైలో ఇన్‌స్టాగ్రాంలో ఆన్‌లైన్‌లో పెట్టుబడికి సంబంధించిన ప్రకటన వచ్చింది. దానికి స్పందించిన బాధితుడు మొదట వెయ్యి రూపాయలు పెట్టుబడి పెట్టగా రెండు వేల రూపాయల లాభం వచ్చింది. దీంతో బాధితుడు ఏడు విడతలో రూ.40.9 లక్షలు సదరు సంస్థలో పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి కింద పెట్టిన డబ్బులకు లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించేది. ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండకపోయేది. దీంతో మోసానికి గురైనట్లు తెలుసుకున్న బాధితుడు 2024 ఆగస్టులో సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుపై కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి విచారణ ప్రారంభించారు. గుజరాత్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో బాధితుడి డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసు టీం సభ్యులు ఈ నెల 27న గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. అక్కడ సైబర్ మోసగాడైన నితిన్‌దేవచంద్ భాయ్ గజేరాని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సూరత్ కోర్టులో నిందితుడిని హాజరు పరిచారు. అక్కడి కోర్టు అనుమతితో ట్రాన్సిస్ట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చి శనివారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడు నితిన్ దేవచంద్ భాయ్ గజేరానిని జైలులో రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఇన్‌వెస్ట్‌మెంట్‌కు సబంధించి సామాజికమాధ్యమాల ద్వారా ఆకర్షణీయ ప్రకటనలు పంపిస్తాడని, స్పందించిన వారికి రెట్టింపు లాభాలు ఆశచూపి ఆర్‌బీ ఎల్ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేయమంటాడని సైబర్ క్రైం డీఎస్పీ తెలిపారు. ఆ అకౌంట్‌పై 19 వరకు కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. తెలంగాణలోని రెండు జిల్లాలతోపాటు, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళలో నితిన్‌దేవచంద్ భాయ్ గజేరానిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.

అనుమానం పెనుభూతమై..

● భార్యపై రోకలిబండతో దాడి.. ఆపై ఆత్మహత్య



దుర్గయ్య(ఫైల్)



రాజవ్వ(ఫైల్)

మల్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను రోకలిబండతో తలపై కొట్టడంతో తీవ్రగాయాలు కాగా భయాందోళనకు గురైన భర్త సదువుల దుర్గయ్య(58) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లిలో జరిగింది. తీవ్రగాయాలతో భార్య రాజవ్వ(48) శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. లంబాడిపల్లికి చెందిన సదువుల దుర్గయ్య బేడ బుడిగ జంగాల కులవృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి భిక్షాటన చేస్తూ మూడు నెలలకోసారి స్వగ్రామానికి వస్తుంటాడు. కొన్నాళ్లుగా భార్యపై అనుమానంతో మద్యానికి బానిసైన దుర్గయ్య రాజవ్వను వేధిస్తున్నాడు. దీంతో కుల పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించి దుర్గయ్యను మందలించారు. అయినప్పటికీ పద్ధతి మార్చుకోక పోగా శుక్రవారం బీడీలు చేస్తున్న రాజవ్వను రోకలిబండతో తలపై దాడి చేశాడు. దీంతో తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు రాజవ్వను వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కాగా భార్య తలకు తీవ్ర గాయాలు కావడంతో భయపడిన దుర్గయ్య గ్రామంలోని బీరయ్యగుడి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దుర్గయ్య కోసం బంధువులు శుక్రవారం రాత్రి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం దుర్గయ్య గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కాగా చికిత్స పొందుతూ రాజవ్వ శనివారం కరీంనగర్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి సిరిగిరి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నీలం రవి తెలిపారు.

ఉగాది కవి సమ్మేళనానికి మానేరు కవులు

సిరిసిల్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా నిర్వహించే కవి సమ్మేళనానికి సిరిసిల్ల నుంచి దాశరథి అవార్డు గ్రహీత ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం కవులు పత్తిపాక మోహన్, అడెపు లక్ష్మణ్, ఈడెపు సౌమ్యలకు తెలంగాణ సాంస్కృతిక శాఖ అహ్వానం పంపింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉగాది సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో వీరు కవితాగానం చేయనున్నారు.

కవి సమ్మేళనానికి వెళ్తున్న కవులను మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టివి నారాయణ, కార్యనిర్వా హక అధ్యక్షుడు ఎలగొండ రవి, మడూరి అనిత, శ్రీమతి, అంకారపు, దూడం గణేష్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

● వేములవాడ ఆలయంలో ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాజన్న ఆలయంలో ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామనవమికి ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటల తర్వాత భక్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయ మే స్వస్తి పుణ్యాహవచనం, స్వామివారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. ఉదయం 10.40 గంటలకు పంచాంగ పూజ, సాయంత్రం 4 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం నిర్వహించనున్నారు.

● 6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని తీరొక్క పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఏప్రిల్ 6న ఉదయం 11.55 గంటలకు సీతారామచంద్ర స్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణం రోజు కోడె మొక్కులు మినహా అభిషేకాలు, అన్నపూజలు, నిత్యకల్యాణాలు, కుంకుమ పూజలు, లింగార్చనలు, శ్రీసత్య నారాయణ వ్రతాలతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నారు.



రాజన్న ఆలయంలో కల్యాణానికి ఏర్పాట్లు

భారీగా తరలిరానున్న భక్తులు

రాజన్న ఆలయంలో నిర్వహించే సీతారామచంద్ర స్వామి వారి దివ్య కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులు రానున్నట్లు ఆల యాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తు లకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో, ఆలయ ఈవో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుం డా టౌన్ సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాములోరి కల్యాణ వాల్‌పోస్టర్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భం గా రాజన్న ఆలయ ఆవరణతో పాటుగా పట్ట ణంలో ఏఈవో అశోక్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ లను అతికించారు.

పథకం ప్రకారమే యువకుడి హత్య

● ప్రోత్సహించిన భార్య, బావమరిది
● పరువుహత్య కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్


ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమించాడనే కారణంతో పరువు హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి కథనం ప్రకారం ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థురాలు అయిన ఒక అమ్మాయిని సాయికుమార్‌గౌడ్ రెండు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకుని పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. ఈ విషయం తెలిసిన అమ్మాయి తండ్రి ముత్యం సదయ్య పలుమార్లు సాయికుమార్‌ని, కూతురిని మందలించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో అతడిని చంపితేనే తన కూతురిలో మార్పు వస్తుందని అమ్మాయి తల్లి సమత సదయ్యతో చెప్పింది. అలాగే రంగాపూర్‌కు చెందిన సమత సోదరుడు కూడా అతన్ని చంపితేనే బాగుంటుందని, ఏమైనా సహాయం అవసరం ఉంటే తర్వాత చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన పూరెల్ల సాయికుమార్‌గౌడ్ జన్మదినం ఉన్నందున కూతురు చదువుతున్న పెద్దపల్లిలోని కాలేజీ వద్దకు వస్తాడని గ్రహించిన సదయ్య, అతని బావమరిది సారయ్యతో కలిసి కాలేజీ వద్ద వాకబు చేశారు. అక్కడ ఆమె లేదని తెలుసుకొని వేచిచూశారు. కూతురిని సాయికుమార్ ద్విచక్ర వాహనంపై కాలేజీ వద్ద దింపి ముప్పిరితోటకు వెళ్లాడు. అనంతరం రాత్రి 9.40గంటలకు సాయికుమార్ మిత్రులతో కలిసి వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మద్యం సేవిస్తుండగా సదయ్య వాహనంపై వెళ్లి సాయికుమార్‌పై గొడ్డలితో విచక్షణ రహితంగా నరికి చంపాడు. అక్కడికి నడుచుకుంటూ వెళ్లిన సదయ్య భార్య సమత సంఘటనను చూసి వెళ్లిపోయింది. సంఘటన జరిగిన వెంటనే నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. శనివారం ఉదయం 11గంటలకు నిందితులు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రాత్రి 10గంటలకు సుల్తానాబాద్ న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు.











ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

TO LET - COMMERCIAL
★ GROUND FLOOR, FOR COMMERCIAL, C&F, OFFICES, GODOWNS. NEAR COURT IN KARIMNAGAR. CELL: 99890 75656
AJK-16625

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మిందబడిన / క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

కలప పట్టివేత

కొడిమ్యాల, మార్చి29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరంపేట, కొడిమ్యాల రేంజ్ పరిధిలోని గోవిందారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన సుమారు 80వేల రూపాయల విలువైన టేకు కలప 52 దుంగలను శుక్రవారం రాత్రి అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ మోనిక ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. అటవీ సిబ్బందికి అందిన పక్కా సమాచారం మేరకు సూరంపేట-గోవిందారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నిల్వ ఉన్న 52 టేకు దుంగలు పట్టుకున్నారు. పట్టుకున్న కలపను కొడిమ్యాల రేంజ్ కార్యాలయం నుంచి కల్లెడలో ఉన్న అటవీ శాఖ క్రర డిపో కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. కలపను పట్టుకున్న వారిలో సూరంపేట బీట్ అధికారి ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యుడు మహేందర్ ఉన్నారు.

ఈజీఎస్ కూలీ ఆకస్మిక మృతి

కోరుట్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన కుంట లక్ష్మీనర్సు (55) అనే ఉపాధి కూలీ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్థులు, ఉపాధికూలీలు శనివారం తెలిపారు. గ్రామ శివారులోని మాటుకాల్వ పూడిక తీత పనులలో కుంట లక్ష్మీనర్సు శుక్రవారం తోటి కూలీలతో పనికి హాజరైంది. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తోటి కూలీలు 108 సిబ్బందికి సమాచారం అందించగా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూగజీవాల అపహరణ

మల్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని పశువుల పాకలో గల మూగజీవాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్యాలకు చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు తన పశువుల పాకలో ఆరు మేకలు, గేదెను కట్టి వేసి ఉంచగా శుక్రవారం రాత్రి మూడు మేకలతో పాటు గేదె దొంగతనంకు గురి అయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ధాన్యం డబ్బులు స్వంతానికి వాడుకున్న వ్యక్తిపై కేసు

సారంగాపూర్, మార్చి, 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం డబ్బులను తన స్వంత అవసరాలకు వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. వివరాల్లోకి వెళితే పోతారం సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన పోతారం గ్రామానికి చెందిన ఒడ్నాల భూమరాజు(35) 11 మంది రైతులకు చెందిన 292 క్వింటాళ్ల రూ.6 లక్షల 78వేల 368లను సహకార సంఘం సభ్యులకు తెలియకుండా తన స్వంత ఖర్చులకు వాడుకున్నాడు. ఈ మేరకు రైతులకు చెల్లించకుండా అవకతవకలకు పాల్పడందుకు సహకార సంఘం అధ్యక్షుడు ఎలేటి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు.

‘బీజేపీ రాజ్యాంగాన్ని కాలరాసే కుట్ర’



ప్రమాణం చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

కథలాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మనువాదం బీజేపీ రాజ్యాంగాన్ని కాలరాసే కుట్ర చేస్తున్న దని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. మండల కేంద్రంలోని ఎస్సార్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. యువతను రెచ్చగొట్టి ఓట్లు సంపాదించుకుంటూ దేశాన్ని విభజించి పాలించే విధానంతో వెళ్తున్న బీజేపీని గద్దె దించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్వహించబోతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిందని రెండు లక్షల రుణమాఫీపై కొందరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండు లక్షల పైబడి రుణం ఉన్న వారికి వర్తించదని పలు మారు చెప్పినా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరమని అన్నారు. ఊరూరా పాదయాత్రలు చేసి బీఆర్ఎస్, బీజేపీ అవలంబిస్తున్న వైఖరిని ఎండగడితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకత్వంకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చట్టాలు చరిత్రాత్మకమైనవని అన్నారు.

‘భారత రాజ్యాంగం ప్రపంచానికే తలమానికం’

భారత రాజ్యాంగం ప్రపంచానికే తలమానికంగా నిలిచిందని రాష్ట్ర సాంస్కృతి సారథి చైర్‌పర్సన్ వెన్నెల పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ కులాలను, మతాలను విభజిస్తూ చాపకింద నీరులా మనువాదాన్ని ప్రోత్సహిస్తోందని విమర్శిం చారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ అధిష్ఠానం నడుము బిగించిందని చెప్పారు.

వేములవాడ, సిరిసిల్ల పీసీసీ కోఆర్డినేటర్ ఆవేజ్ మాట్లాడుతూ ఏఐసీసీ దూరదృష్టితో రూపొందించిన కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి జిల్లా ధనుంజయ్‌రెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, ఎస్ఆర్ఐ బైర దేవ్, ఏఎంసీ డైరెక్టర్లు అల్లకొండ విజయ్, లింగంగౌడ్, కారపు గంగాధర్, ఎగ్యారపు శ్రీహరి, పిడుగు తిరుపతిరెడ్డి, ముదాం శేఖర్, తలారి మోహన్, వాకిటి రాజరెడ్డి, చిన్నారెడ్డి, పురుకుటపు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

‘డీ లిమిటేషన్ పేరుతో కుట్ర’

మేడిపల్లి: డీ లిమిటేషన్ పేరుతో దక్షణాది రాష్ట్రాలపై బీజేపీ కుట్ర చేస్తోందని వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో మేడిపల్లి, బామారం మండలాల జై బాపు, జై భీమ్, జై సంబిధాన్ కార్యక్రమ నిర్వహణ అమలు పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, వేములవాడ, సిరిసిల్ల నియోజికవర్గ పిసిసి కో ఆర్డినేటర్ అవేజ్ లో కలిసి ఆదిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. స్వేచ్ఛ ఫలాలు భారత దేశంలోని అందరికీ అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ సందర్భంగా మాచాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి విప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి,జలందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఇజ్రాయిల్, జలందర్, బలగం రాజేష్, దామోదర్, నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది వేడుకలు



రాజారం ప్రాథమిక పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని రామకృష్ణ ప్రైమ్ పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ కృష్ణ విద్యా సంస్థల చైర్మన్ యాద రామకృష్ణ విశ్వవసు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ కర్యాక్రమంలో కళాశాల డైరెక్టర్లు పల్లెర్ల నరేష్, కొక్కుల రాజెందర్, గోపు మునిందర్ రెడ్డి, దీపిక అధ్యాపకులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. గీతా సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చీలమతుల చత్రపతి ఉగాది పర్వదినం గురించి విద్యార్థులకు వివరించారు. ఆర్ఎస్ఎస్ నగర ప్రముఖ్, న్యాయవాది చిట్యాల శివ కుమార్ డాక్టర్ హెగ్డేవర్ జీవిత చరిత్రను వివరించి ఉగాది వేడుకలతో పాటు అతని జయంతి వేడుకలను జరిపారు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు గోపు వెంకటేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** మండలంలోని రాజారంగ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ధర్మపురి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది పండుగ వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు సాదు శ్రీకాంత్, రావులపెల్లి వెంకటరమణ, ఇంచార్జ్ హెచ్ఎం కాసర్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** మండలంలోని పోతారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల లాస్య స్కూల్‌లో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా తెలుగు సంవత్సరాది ఉగాది ప్రాశస్త్యం ఉట్టిపడేలా వేడుకలు జరిపారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజుసుస్న, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పాషిగామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమము లో ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ కుమార్ మాట్లాడుతూ జీవితం కూడా ఉగాది పచ్చడి లాగా అనేక రకాల కష్ట సుఖాల సమ్మిళతం అని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి, బూరెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, శ్రీనివాస్, రజిత గ్రామ పెద్దలు బొప్పు తిరుపతి, బర్పటి జనార్ధన్, గోపతీ నరేష్, నలిమెల సురేష్, శ్రీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండలం వెన్గుమట్ల గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి అల్లె వరలక్ష్మీ, పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో న్యాయాధికారి పూజలు

మల్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.రామమోహన్‌రెడ్డి శనివారం కొండగట్టు అంజనేయస్వామిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు.

రేపు కవి సమ్మేళనం

కొడిమ్యాల, మార్చి29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అక్షయ గార్డెన్‌లో 31న ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కడమేడ కళా సాహితీ అధ్యక్షుడు మల్లారపు రాజయ్య శనివారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల30 సాయంత్రం 5గంటలలోపు ఎం. రాజయ్య సెల్ 9014925716, సత్యానందం 9441731855 నెంబర్లలో నమోదు చేయించుకోవాలని కోరారు.

శాతవాహన నాగరికత తెలంగాణ సమాజానికి దిక్సూచి

-ఆంధ్రజ్యోతితో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్

జగిత్యాల అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన నాగరికత తెలంగాణ సమాజానికి దిక్సూచి అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. శనివారం జగిత్యాల కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. శాతవాహనుల చరిత్రను చాటి చెప్పిన జగిత్యాల కేంద్ర గ్రంథా లయాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చుతామన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని రియాజ్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయనకు ఉద్యోగులు పలు సమస్యలను విన్నవించారు. దానికి స్పందించిన ఆయన ఇప్పటికే ముఖ్యమంత్రికి విన్నవించానని త్వరలో సమస్య పరిష్కరించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. లైబ్రేరియన్ శకుంతల, కవిత సిబ్బంది ఆయనను సత్కరించారు.

తెలుగు రాష్ట్రాల్లో మరో 15 గాయత్రి బ్యాంక్ బ్రాంచ్‌లు

-గాయత్రి బ్యాంక్ సీఈవో శ్రీనివాస్

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో మరో 15 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు గాయత్రి బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని గాయత్రి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 15 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ అనుమతినిచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 బ్రాంచ్‌లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 5 బ్రాంచ్‌లను కొత్తగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, బోదన్, హన్మకొండ జిల్లా పరకాల, వరంగల్ జిల్లా నర్సంపేట్, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, మదిర, వైరా, నల్గొండ జిల్లా నల్గొండ, మిర్యాలగూడలో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో గాయత్రి బ్యాంక్ జనరల్ మేనేజర్లు ఎమ్మడి శ్రీలత, రామ్ సత్య నారాయణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్ క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

-ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు తగిన జాగ్రత్త వహించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ధర్మపురి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆకాంక్షించారు. ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎలగొండ రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

‘పండుగలు ఘనంగా నిర్వహించాలి’

జగిత్యాల అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల మున్సిపల్ కమిషన్ స్పందన, ఇతర అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవికాలం నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీ డబుల్ బెడ్ రూంలలో నివసిస్తున్న ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అడువాల లక్ష్మణ్, వొద్ది రామ్మోహన్, జుంబర్తి రాజ్ కుమార్, మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

జగిత్యాల అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమ నారాయణ రెడ్డి, కొండ శ్రీధర్, ఓరుగంటి భార్గవ్, గంగాధర్, మల్లయ్య పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్, టీడీపీ నాయకులు పాతర్ల విజయ్ కుమార్, గజనంద్, గజ్జలి రాజ గణేష్, మచ్చ లక్ష్మిపతి పాల్గొన్నారు.

●**రాయికల్:** పట్టణంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అడహక్ కమిటీ సభ్యులు సోమ నారాయణ రెడ్డి, నాయకులు మోర గణేష్, బొల్లారం రాజేశం, గోనె భూమేశ్వర్, లక్ష్మీనర్సయ్య, మహ్మద్ సాహెబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓరగంటి భార్గవరామ్, నాయకులు కందుకూరి తిరుపతి, సాన స్వామి, ముదాం లక్ష్మీరాజం, స్వామి, సాంబారి సంతోష్, గర్వందుల రవిగౌడ్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

మల్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యం పేటలో శనివారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నినర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరీశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి, పంచాయితీ కార్యదర్శి స్వప్నతో పాటు అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి :** సమాజంలో పౌరులందరు సమానులేనని, అంటరానితనం పేరుతో వివక్షకు గురి చేస్తే చట్టరీత్యా శిక్షకు గురవుతారని పెగడపల్లి మండల పంచాయితీ అధికారి మహేందర్ పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండలంలోని నార్సింహానిపేటలో అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో గిర్దావర్ జమున, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** రాజ్యాంగం అందరూ సమానులేనని చెబుతుందని దళిత వర్గాలను అంటరానివారుగా చూస్తే కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ పరిశీలకులు (ఆర్ఐ) నగేశ్ పేర్కొన్నారు. మండలంలోని దూలూరులో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైభవ్, కారోబార్ అజయ్, అంబేద్కర్ సంఘ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

●**రాయికల్:** రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖయ్యూం గ్రామస్థులకు అంటరానితనం, అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



కోరుట్లలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రుల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాట చేసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. టీజీఐఐసీ అధికారులతో మాట్లాడి త్వరగా ఆక్సిజన్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ఏ పేషెంట్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్ సిబ్బంది నియమకంపై ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకపోతానని తెలిపారు. డయాలసిస్ పేషెంట్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేయాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. గవర్నమెంట్ మెడికల్ కళాశాల సూపరిండెంట్‌తో మాట్లాడి బిడిఎస్ దంత వైద్యులు ఉన్నందున వారికి అవసరమయ్యే పరికరాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సూనిత, వైద్యులు లక్ష్మి, వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి పట్టణంలో అసంపూర్ణంగా ప్రభుత్వ ఆసుపత్రి ఉన్న విషయంతో పాటు నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి శాసనసభలో తీసుకపోయానని వాటి పరిష్కారం కొరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసపత్రిలో అభివృద్ధి కమిటి సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అసుపత్రిలో ఉన్న సమస్యలపై చర్చించారు. అసుపత్రిలో మందుల కొరత ఉండకుండా టీఎస్ మెడికల్ అధికారి ఫోన్ ద్వారా మాట్లాడి మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా, గర్భిణిలకు తగిన సూచనలు సలహాలను ఆరోగ్య సిబ్బంది అందించాలన్నారు. అసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి మరింత మంది వైద్యులను నియమించాలని జిల్లా సూపరిండెంట్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. నూతన ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి కావడానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకపోతానని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ బోయినిపల్లి చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ నాయకులు మెరుపు తేజ, ఆకుల ప్రవీణ్, ఓజ్జెల శ్రీనివాస్, కిషోర్, శ్రీనివాస్, పురుషోత్తంలు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మల్లాపూర్ : గ్రామాల్లోని సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి సన్మానం

ధర్మపురి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి పూజిత పవర్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో ఎంపికైంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పూజితను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఎలాంటి అవసరం ఉన్నా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పూజిత భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ పాలకవర్గ సభ్యులు కుమ్మరి తిరుపతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వెల్మల సతీష్ పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

కోరుట్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని శనివారం స్వేచ్ఛ సాహితీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కవులను సేవా సమితి సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాస భూమయ్య, సమితి సభ్యులు వోటరికారి శ్రీనివాస్, రుద్ర నాగరాజు, విశ్వనాథం, కటకం కవిత, వోటరికారి చిన్న రాజన్న, పాలెపు రాజేశ్వర్ శర్మ, రాస బత్తుల రాజశేఖర్, రాస గౌతమ్ ఉన్నారు.

రెండు గ్రామాల మధ్య సరిహద్దు వివాదం

- మొగిలిపేట, నడికుడ గ్రామాల సరిహద్దులో పోలీస్ పికెటింగ్



నడికుడ గ్రామస్థులను అడ్డుకుంటున్న పోలీసులు

మల్లాపూర్, మార్చి, 29 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, నడికుడ గ్రామాల మధ్య శనివారం సరిహద్దు వివాదం నెలకొంది. ఇక్కడ నుంచి భూమి మా పరిధి అంటే మా పరిధి అంటూ రెండు గ్రామాల ప్రజలు పోటా పోటీగా సరిహద్దు సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. ఎస్సారెస్పీ కాలువ నిర్మాణంలో భాగంగా పునరావాసం కింద మొగిలిపేట గ్రామ శివారులోని 447 సర్వే నంబర్ గల 161 ఎకరాల భూమిని నడికుడ గ్రామస్థులకు కేటాయించారు. ఇందులో కొంత భాగాన్ని సాగు చేసుకోగా మరికొంత భాగాన్ని నివాసానికి వాడుకుం టున్నారు. సుమారు 5ఎకరాల భూమి ఖాళీగా ఉంది. అందులోని కొంత భాగంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం మొగిలిపేట గ్రామస్థులు చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న నడికుడ ప్రజలు అక్కడికి బయల్దేరారు. దీంతో ముందస్తు చర్యలో భాగంగా పోలీసులు ఇరు గ్రామాల శివారులోని ప్రజలను అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు, అదనపు బలగాలతో వివాదాస్పద భూమి వద్దకు చేరుకున్నారు. సమస్యకు గల కారణాలన ఇరు గ్రామాలకు చెందిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో, పోలీసులు సమస్యను ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఏప్రిల్ 16న సర్వే జరిపేందుకు అధికారులు వస్తారని అప్పటి వరకు పనులు నిలిపి వేయాలని మొగిలిపేట గ్రామస్థులను ఆదేశించారు. మొగిలిపేట గ్రామస్థులతో పనులను నిలిపివేయించి వెనక్కి పంపించారు. ఇరు గ్రామాల ప్రజలు అక్కడికి మళ్లీ రాకుండా ముందస్తు చర్యలో భాగంగా పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఇఫ్తార్ విందు

భీమారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం రాత్రి పలువురు ప్రజాప్రతినిధులు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ముస్లీం మత పెద్దలు మక్బూల్, సయ్యద్ గులాం, నాసర్, అజ్జు, ఇస్మాయిల్, రాజబోసు, నజీర్, కాంగ్రెస్ నాయకులు అంగడి ఆనంద్, నీరటి మల్లేశం, గణేష్, ప్యాట నారాయణ, హరీష్, చెక్కపెల్లి సంజీవ్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఎండపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి నేటికి 43 వ సంవత్సరం సందర్భంగా మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన అనాధ కుటుంబానికి పేద కుటుంబాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సముద్రాల రమేష్ గుప్తా నిత్యవసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఆయన వెంట నేరెళ్ల పోచయ్య, దోనిపెల్లి హరీష్ పాల్గొన్నారు.

ముగిసిన వారసంత వేలం

కొడిమ్యాల, మార్చి29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంత వేలం శనివారం మండల పరిషత్ సూపరిండెంట్ సురేందర్ సమక్షంలో నిర్వహించగా 1లక్ష 60వేల 100రూపాయలకు పాట పాడి పాటదారుడు దక్కించుకున్నాడు. గ్రామ పంచాయతీకి చెందిన 9గదులకు వేలం పాట నిర్వహించగా టెండర్దారులు నలుగురు నాలుగు గదులకు ఒక్కొరు చొప్పున వచ్చినట్లు కార్యదర్శి ఎల్. వంశీవర్ధన్ తెలిపారు. 9గదుల వేలం సరైన పాటదారులు హాజరు కానందున గదుల వేలం నిలిచినట్లు తెలిపారు.

అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా రవీందర్

కొడిమ్యాల, మార్చి29(ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎలగుర్తి రవీందర్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఆరెల్లి రాజయ్య ప్రకటించారు. అధికార ప్రతినిధిగా నేరెళ్ల మహేష్, గౌరవ అధ్యక్షునిగా తాండ్ర పోచయ్య, ఉపాధ్యక్షులుగా దోమకొండ నర్సయ్య, కడకుండ్ల అంజయ్య, ప్రధానకార్యదర్శిగా రామంచ లక్ష్మన్, సహాయ కార్యదర్శులుగా ఈదురి మహేష్, కాంపెల్లి బాబు, కోశాధికారిగా కోలపురం రమేష్‌ను ఎన్నుకున్నారు.